# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 20 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :20 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 25 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు..
## ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

- ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం
- విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రెజ్‌లకు ప్రతిపాదనలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు.

- మిగతా 2లో



## విద్యుత్ లైన్లు తగిలి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అన్ని విధాలా సాయం అందిస్తాం

- విద్యుత్ ప్రమాదాలు, భారీ వర్షాలపై గొట్టిపాటి సమీక్షా సమావేశం
- విద్యుదాఘాతంతో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి
- విద్యుత్ వైర్లు తెగిపడితే వెంటనే ఫిర్యాదు చేయాలా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన విద్యుత్ ప్రమాదాలు, ఉత్తరాంధ్రలో వాయు గుండం ప్రభావంతో తలెత్తిన పరిస్థితులపై రాష్ట్ర విద్యుత్ శాఖ

- మిగతా 2లో

## రాష్ట్రంలో నేడు కూడా వర్షాలు..
# జలాశయాలు నింపండి
### సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- రాష్ట్రంలో నేడు కూడా వర్షాలు కొనసాగుతాయని అంచనాల నడుమ సీఎం చంద్రబాబు సమీక్ష
- భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలన్నీ నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- గోదావరి, కృష్ణా బేసిన్లలో పలుచోట్ల వరద హెచ్చరికలు జారీ చేసే అవకాశం
- ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచన
- వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, క్రీడలు, విద్యుత్ సరఫరాపైనా కీలక ఆదేశాలు జారీ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతా వరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నదులు, వాగులకు వస్తున్న వరద ప్రవాహాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మోటార్లు ఉపయోగించి లిఫ్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి ప్రవాహాలతో ఏలేరు రిజర్వాయర్‌లో 24 టీఎంసీల నీటిని నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని తరలించాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం, మన్యం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా 16 జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు.

**ప్రధాన నదులకు వరద హెచ్చరికలు**

గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని

- మిగతా 2లో



## డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం..
## 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి

- విశాఖలో డేటా సెంటర్ల కోసం పోలవరం జలాల వినియోగం
- ఏపీలో 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్ల ఏర్పాటు
- అమరావతిలో క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్ అభివృద్ధి
- 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో ఏర్పాటు చేసే డేటా సెంటర్లు పర్యావరణ హితంగా ఉండేలా సమగ్రమైన విధానాన్ని అనుసరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌లో కనీసం 70 శాతం సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉండాలనే నిబంధనను తప్పనిసరి చేశామని ఆయన తెలిపారు.గురువారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డేటా సెంటర్ల ఏర్పాటుకు పర్యావరణపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ క్లస్టర్ నీటి అవసరాల కోసం పోలవరం ఎడమగట్టు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నామని చెప్పారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని విశాఖకు

- మిగతా 2లో



## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు..
## విచారణకు రావాలని ఆదేశం

- లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో అంబటికి ఈడీ నోటీసులు
- ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి రావాలని ఆదేశం
- 15 రోజుల క్రితమే స్టంట్లు వేయించుకున్నానన్న అంబటి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి

- మిగతా 2లో



## యూపీలో కాలి బూడిదైన టూరిస్ట్ బస్సు..
### నిద్రలోనే 9 మంది సజీవదహనం

- యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై టూరిస్ట్ బస్సులో చెలరేగిన మంటలు
- ప్రమాదంలో 9 మంది ప్రయాణికులు సజీవ దహనం, పలువురికి గాయాలు
- నిద్రలో ఉండగా ఒక్కసారిగా వ్యాపించిన అగ్నికీలలు
- మృతుల కుటుంబాలకు సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం

- మిగతా 2లో

## 48 గంటల్లో రాజీనామా చేయాలి..
### ఈసీ జ్ఞానేష్ కుమార్ కు కాక్రోచ్ ల అల్టిమేటం



**పెన్ పవర్ డెస్క్:**48 గంటల్లోగా కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని అల్టీమేటం జారీ చేసింది. ఎన్నికల సంఘం చేపట్టిన SIR ప్రక్రియ, ఈసీ జ్ఞానేష్ కుమార్ పై తీవ్ర విమర్శలు

- మిగతా 2లో

## ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారింది..
## సీఈసీ రాజీనామా చేయాలి

**పెన్ పవర్ డెస్క్:**చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన వ్యక్తి కాదని.. మోదీ, షా ద్వారా ఎన్నుకోబడ్డ వ్యక్తి అని అన్నారు లోక్ సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ. ఈ ముగ్గురు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారిందని విమర్శించారు. 2026 సెప్టెంబర్ 24న ఈసీ భిన్నాభిప్రాయంపై ప్రెస్ మీట్ నిర్వహించిన రాహుల్ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు.

- మిగతా 2లో




## అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

- యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీలకు వ్యతిరేకంగా వ్యాపారుల నిరసన
- అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని వ్యాపార సంఘాల పిలుపు
- రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుమును విధించనున్న ప్రభుత్వం
- కొత్త నిబంధనలు వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

- మిగతా 2లో






## చైనా, అమెరికా ప్రత్యర్థులు కాదు..పార్ట్‌నర్స్
### అమెరికా పర్యటనలో జిన్ పింగ్

**పెన్ పవర్ డెస్క్:**మూడు రోజుల అమెరికా పర్యటనలో ఉన్న చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. చైనా, అమెరికా దేశాలు ప్రత్యర్థులు కాదని.. భాగస్వాములని అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్ లోని బేస్ అండ్రూస్ లో ప్రత్యేక విమానంలో దిగిన జిన్ పింగ్ సందర్భంగా ఈ వ్యాఖ్యలు. సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లిన జిన్ పింగ్ కు అందరినీ ఎన్నడూ లేని విధంగా ఆశ్చర్యపరుస్తూ ట్రంప్ దంపతులు స్వాగతం పలికారు.చైనా, అమెరికా ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆకాంక్షించారు. బుధవారం వాషింగ్టన్ చేరుకున్న జిన్ పింగ్ రాబోయే రోజుల్లో చైనా, అమెరికా కలిసి ముందుకు

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## ఎన్నికల సంఘంపైనే ప్రశ్నలు తలెత్తితే?

### అంతర్గత అభ్యంతరాలకు రాజకీయ వాదనలు కాదు... పారదర్శక సమాధానాలే పరిష్కారం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత ముఖ్యమో, ఎన్నికలను నిర్వహించే వ్యవస్థపై ప్రజలకు ఉండే విశ్వాసం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ఫలితంపై రాజకీయ పార్టీలు విభేదించవచ్చు. ఓటర్ల జాబితాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు రావచ్చు. కానీ ఎన్నికల వ్యవస్థలోనే కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారి నుంచి ప్రశ్నలు తలెత్తినప్పుడు వాటిని సాధారణ రాజకీయ వివాదంగా కొట్టిపారేయడం సరికాదు.

ఇటీవల ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ఈ నేపథ్యంలో తీవ్రమైన చర్చకు దారితీసింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని నిర్ణయాలు, ఆదేశాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు--పునరుద్ధరణ, ఫారం--6లో మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఐటీ వ్యవస్థపై పర్యవేక్షణ వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నట్లు నివేదిక తెలిపింది.

ఇక్కడ ఎవరి రాజకీయ వాదన సరైనదన్నది ప్రధాన ప్రశ్న కాదు. దేశ ఎన్నికల వ్యవస్థపై తలెత్తిన ప్రశ్నలకు ప్రజలకు అర్థమయ్యే సమాధానాలు ఉన్నాయా? అన్నదే ముఖ్యం.

**ఓటర్ల జాబితా ప్రక్షాళన అవసరమే... కానీ**

ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు సవరించడం ఎన్నికల నిర్వహణలో అవసరమైన ప్రక్రియ. మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు, చట్టపరంగా అనర్హమైన నమోదులను గుర్తించి జాబితాలను సరిచేయాల్సిందే.

కానీ ఆ ప్రక్రియ ఎంత అవసరమో, దానిలో పారదర్శకత అంతకంటే అవసరం.

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ---హ×= ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముసాయిదా జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడినట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఈ సంఖ్యలో నిబంధనలకు అనుగుణంగా తొలగించిన నమోదులు ఉండవచ్చు. అదే సమయంలో అర్హుడైన ఒక్క ఓటరు పేరు పొరపాటున తొలగిపోయినా, దానిని సరిచేసుకునేందుకు సులభమైన, వేగవంతమైన, న్యాయమైన అవకాశం ఉండాలి. ఎందుకంటే ఓటర్ల జాబితాలో ఒక పేరు అనేది కేవలం డేటాబేస్‌లోని ఒక ఎంట్రీ కాదు. అది ఒక పౌరుడు తన ఓటు హక్కును ఆచరణలో వినియోగించుకునేందుకు ద్వారం.

**డిజిటల్ వ్యవస్థకు జవాబుదారీతనం ఎవరిది?**

ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశాల్లో ఓటర్ల డేటాబేస్ నిర్వహణ ఒకటి.

సాంకేతికత ఎన్నికల వ్యవస్థను వేగవంతం చేయాలి. తప్పులను తగ్గించాలి. డూప్లికేట్ నమోదులను గుర్తించాలి. కానీ చట్టబద్ధ అధికారుల నిర్ణయాధికారాన్ని అస్పష్టమైన సాంకేతిక వ్యవస్థ భర్తీ చేసే పరిస్థితి ఏర్పడకూడదు. ఓటర్ల జాబితాలో ఒక పేరు ఎవరు చేర్చారు? ఎవరు తొలగించారు? ఎందుకు తొలగించారు? ఏ అధికారి అనుమతించారు? ఏ ఆధారంతో నిర్ణయం తీసుకున్నారు? తర్వాత ఆ నిర్ణయాన్ని ఎవరు మార్చారు?

**ఈ ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన డిజిటల్ ఆడిట్ ట్రయిల్ ఉండాలి.**

గోవాలో స్థానిక ఎన్నికల నమోదు అధికారులు అర్హులుగా నిర్ధారించిన 97 మంది ఓటర్ల విషయంలో కూడా సాంకేతిక వ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఎదురైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తాజాగా నివేదించింది. ఇటువంటి ఉదంతాలు డిజిటల్ వ్యవస్థల రూపకల్పన, అధికార పరిధి, జవాబుదారీతనంపై మరింత స్పష్టత అవసరమనే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి.

**భిన్నాభిప్రాయం బలహీనత కాదు**

రాజ్యాంగ సంస్థలో అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు రావడం తప్పనిసరిగా సంస్థ బలహీనతకు సంకేతం కాదు.

నిజానికి ప్రశ్నించడం, అభ్యంతరాలను నమోదు చేయడం, ఒక నిర్ణయాన్ని పునఃపరిశీలించడం- ఇవన్నీ ఆరోగ్యకరమైన సంస్థాగత ప్రక్రియలో భాగమే.

అందువల్ల ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారా అన్నదొక్కటే ముఖ్యం కాదు.

ఆ అభ్యంతరాలను ఎలా పరిష్కరించారు?

వాటిపై ఏ నిర్ణయం తీసుకున్నారు?

ఆ నిర్ణయానికి చట్టపరమైన ఆధారం ఏమిటి?

అవసరమైన చోట ప్రజలకు వివరణ ఇచ్చారా?

**ఇవే అసలు ప్రశ్నలు.**

ఆరోపణలకు ఆధారాలు కావాలి... ప్రశ్నలకు సమాధానాలు కావాలి

ఎన్నికల జాబితాల సవరణ అధికార పార్టీకి ప్రయోజనం కలిగించేలా జరుగుతోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం, అధికార పక్షం ఇటువంటి ఆరోపణలను ఖండిస్తున్నాయి.

రాజకీయ ఆరోపణను ఆరోపణగానే చూడాలి. ఆధారాలు లేకుండా దానిని నిజంగా నిర్ధారించకూడదు.

అదే సమయంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు, డేటా భద్రత, చట్టబద్ధ అధికారాలపై తలెత్తే ప్రతి ప్రశ్ననూ రాజకీయ ప్రేరేపితమని పక్కన పెట్టడం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు మేలు చేయదు. ప్రశ్న ఎవరు అడిగారన్నది కాదు... దానికి సమాధానం ఏమిటన్నదే ముఖ్యం.

ప్రజా విశ్వాసమే అసలైన మౌలిక వసతి

ఎన్నికల సంఘం బలం కేవలం ఎన్నికల తేదీలు ప్రకటించడంలోనో, పోలింగ్ నిర్వహించడంలోనో, ఫలితాలు వెల్లడించడంలోనో లేదు.

**దేశంలోని సామాన్య ఓటరు---**

"నా పేరు ఓటర్ల జాబితాలో సురక్షితంగా ఉంటుంది.

పొరపాటు జరిగితే దాన్ని సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

నా పేరును తొలగిస్తే కారణం తెలుస్తుంది.

నేను అప్పీల్ చేసుకోగలను.

నా ఓటుకు సంబంధించిన నిర్ణయాలు చట్టబద్ధంగా జరుగుతాయి."

అని నమ్మగలగడమే ఎన్నికల వ్యవస్థకు అసలైన బలం.

అందుకే ప్రస్తుతం తలెత్తిన ప్రశ్నలను ఎన్నికల సంఘం తనపై దాడిగా కాకుండా సంస్థాగత పారదర్శకతను మరింత బలోపేతం చేసుకునే అవకాశంగా చూడాలి. చట్టపరంగా వెల్లడించగల అంతర్గత విధానాలు, నిర్ణయ ప్రక్రియలు, ఓటర్ల డేటా నిర్వహణ పద్ధతులు, పేర్ల తొలగింపు--పునరుద్ధరణ ప్రమాణాలు, అప్పీళ్ల వ్యవస్థపై సాధ్యమైనంత స్పష్టమైన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచడం విశ్వాసాన్ని పెంచుతుంది.

ప్రజాస్వామ్యం "మమ్మల్ని నమ్మండి" అనే మాటపై మాత్రమే నిలబడదు.

అది పారదర్శకమైన విధానాలు, చట్టబద్ధమైన నిర్ణయాలు, స్వతంత్ర పరిశీలన, సమర్థవంతమైన అప్పీల్ వ్యవస్థ, ప్రజలకు జవాబుదారీతనం మీద నిలబడుతుంది.

**చివరికి ప్రశ్న ఒక్కటే---**

అర్హత కలిగిన ప్రతి భారతీయుడు తన ఓటు హక్కు సురక్షితమని నమ్మగలుగుతున్నాడా?

ఆ నమ్మకాన్ని మాటలతో కాకుండా వ్యవస్థతో నిరూపించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే.

ఎన్నికలు ఎవరు పాలించాలో నిర్ణయిస్తాయి.

కానీ ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో నిర్ణయిస్తుంది.

## విద్యుత్ లైన్లు తగిలి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అన్ని విధాలా సాయం అందిస్తాం

- మొదటి పేజి తరువాయి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపట్ల మండలంలో తెగిపడిన ఎల్‌టీ విద్యుత్ లైన్ తాకి తల్లి, కుమారుడు మృతి చెందిన ఘటనతో పాటు, నర్సీపట్నం నాతవరంలో విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోవడంపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన నాగరాజుకు అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ వైర్లు, స్తంభాల స్థితిగతులను నిరంతరం పరిశీలించాలని స్పష్టం చేశారు. వాయుగుండం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తుండటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈపీడీసీఎల్ పరిధికి అవసరమైన అదనపు సిబ్బందిని, విద్యుత్ మెటీరియల్‌ను ఎస్‌పీడీసీఎల్ నుంచి పంపించినట్లు తెలిపారు.

ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలినా, వైర్లు తెగిపడినా తక్షణమే సంబంధిత సమీప కార్యాలయాలకు ఫిర్యాదు చేసేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం ఉన్న చోట వాతావరణం అనుకూలించిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రంలో నేడు కూడా వర్షాలు.. జలాశయాలు నింపండి

- మొదటి పేజి తరువాయి

సీఎం ఆదేశించారు. ప్రస్తుత వర్షాలకు గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, పంపా, మేఘాద్రిగడ్డ రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరనుందని అధికారులు అంచనా వేశారు. గొట్టా బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 25 ఉదయానికి, భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం నాటికి మొదటి, సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయవచ్చని వివరించారు.

**ఎల్‌నినోపై వ్యూహం.. సాంకేతికత వినియోగం**

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు భూసారాన్ని పెంచడం, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాలను ప్రోత్సహించాలని చంద్రబాబు అన్నారు. దీనిని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ఆదేశించారు. అక్టోబరు 2న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నామని, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే కార్యక్రమం కూడా అదే రోజు ప్రారంభిస్తామని తెలిపారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా అమెరికాలో ఉంటున్న పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్‌ను సీఎం పరిశీలించి, అతడిని అభినందించారు.

ఈ సమీక్షలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని,

విద్యుత్ సరఫరా నాణ్యత పెంచాలని, ఇసుక సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు శాప్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడా క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. నియోజకవర్గాల్లో అధికారుల పనితీరు మెరుగుపరిచేందుకు నోడల్ అధికారులతో సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

- మొదటి పేజి తరువాయి

**కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం**

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

**గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది**

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు. దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

**ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్ తో భేటీ**

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (౹ూూ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ూవీజు) డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ౹ూూ నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు.

దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

**స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి**

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (=×ు)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ఫైన్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ,

## ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారింది.. సీఈసీ రాజీనామా చేయాలి

**రాహుల్ గాంధీ కామెంట్స్:**

ఉద్దేశపూర్వకంగానే ఓట్ల తొలగింపు

పార్టీలను టార్గెట్ చేసి ఓట్లు తొలగించారు

ఓటు హక్కును కాలరాస్తున్నారు

ఓటు అనేది ప్రజాస్వామ్యానికి పవర్

నేను ఆధారాలు లేకుండా మాట్లాడటం లేదు

రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు

ప్రజల ఓటును కాపాడటం ఈసీ బాధ్యత

సీఈసీ జ్ఞానేష్ కుమార్ మోదీ, షా ద్వారా ఎన్నుకోవడ్డ వ్యక్తి..

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం లేదు

ఓటు చోరీ ఇప్పుడు చట్టం చోరీగా మారింది.

ఎంత పెద్ద నేత అయిన కొంత కాలం తర్వాత వ్యతిరేకత ఉంటుంది..

బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత ఇందిరాగాంధీ పాపులారిటీ పెరిగింది

ఆ తర్వాత కొంత కాలం తర్వాత ఆమెపై వ్యతిరేక వచ్చింది

మోదీపై వ్యతిరేకతను కనబడకుండా చేస్తున్నారు

వ్యతిరేకత నుంచి బీజేపీ తప్పించుకోవాలని చూస్తోంది

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు.. విచారణకు రావాలని ఆదేశం

- మొదటి పేజి తరువాయి

రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ స్పందించారు. 15 రోజుల క్రితం గుండెకు స్టంట్‌లు వేయించుకున్నానని, డాక్టర్ల సలహా మేరకు ప్రస్తుతం కోలుకుంటున్నానని తెలిపారు. పూర్తిగా కోలుకున్న తర్వాత ముందుగా సమాచారం ఇచ్చి విచారణకు వస్తానని, తప్పనిసరిగా సహకరిస్తానని మెసేజ్ పంపారు. ఆయన సమాధానంపై ఈడీ అధికారులు ఇంకా స్పందించాల్సి ఉంది. ఇదే కేసులో ఈరోజు మర్రి సుబ్బారెడ్డి, పురుషోత్తమరావుల వాంగ్మూలాలను ఈడీ నమోదు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు లిక్కర్ రవాణా కోసం సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టినట్లు గుర్తించారు.

మొదటి కాంట్రాక్టు కాలంలో వీరిద్దరూ కలిసి సుమారు 59.14 లక్షల మద్యం పెట్టెలు రవాణా చేశారని అధికారులు ప్రశ్నించారు. సిగ్మా సంస్థ నుంచి రూ.15.44 కోట్లు అందుకున్నట్లు విచారణలో వెల్లడైంది. సబ్‌కాంట్రాక్టులు, నిధుల మళ్లింపు, అంబటి రాంబాబుతో ఉన్న సంబంధాలపై కూడా వివరాలు అడిగారు. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను అధికంగా పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ఈడీ లెక్కలు చూపిస్తోంది.

# అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్..

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

**అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు**

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (౹2వీ - పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీఱ=) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే (౹2౹ - పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (౹2౹వీ) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

**వ్యాపారుల ఆందోళన ఎందుకు?**

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (వీూజజ×ూ), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (ూ×జూణఖీ) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

# యూపీలో కాలి బూడిదైన టూరిస్ట్ బస్సు..

ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం జరిగింది. వేగంగా వెళుతున్న ఓ స్లీపర్ టూరిస్ట్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో 9 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈ బస్సు ఢిల్లీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మహోబాకు సుమారు 30 మందికి పైగా ప్రయాణికులతో బయలుదేరింది. గ్రేటర్ నోయిడా సమీపంలోకి రాగానే బస్సులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ప్రమాద సమయంలో ప్రయాణికుల్లో ఎక్కువ మంది గాఢ నిద్రలో ఉండటంతో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే అగ్నికీలలు బస్సును పూర్తిగా చుట్టుముట్టాయి. భయాందోళనకు గురైన కొందరు ప్రయాణికులు కిటికీల నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జేవార్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## డేటా సెంటర్లకు ఏపీ కొత్త విధానం.. 70 శాతం గ్రీన్ ఎనర్జీ తప్పనిసరి

- మొదటి పేజి తరువాయి

మళ్లించి డేటా సెంటర్ల అవసరాలు తీరుస్తామన్నారు. నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే ఒక సంస్థ ఈ దిశగా ముందుకొచ్చిందని వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన లక్ష్యంగా 23 రంగాల వారీగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. సిమెంట్, ఆటోమొబైల్ వంటి సంప్రదాయ తయారీ రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రేర్ ఎర్త్ మినరల్స్, బయోమెడికల్, ఫార్మా వంటి ఆధునిక రంగాలకు కూడా ఈ క్లస్టర్లలో చోటు కల్పించామన్నారు. ఏపీలో గూగుల్ భారీ పెట్టుబడి పెడుతోందని, దీని స్ఫూర్తితో మరిన్ని కంపెనీలు డేటా సెంటర్ల రంగంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అమరావతి కేంద్రంగా క్వాంటం టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఐబీఎం నుంచి 150-క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను అమరావతికి తీసుకొచ్చిన తొలి రాష్ట్రం ఏపీ అని గుర్తుచేశారు. ఈ సాంకేతికతకు అవసరమైన క్రయోజెనిక్స్, మెటీరియల్ సైన్సెస్ వంటి అనుబంధ రంగాలనూ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు అన్ని రంగాల్లోనూ రాణించాల్సి ఉంటుందన్నారు. క్వాంటం టెక్నాలజీ ఎంత ముఖ్యమో, హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. అక్టోబర్ 2న దాదాపు రూ.1 లక్ష కోట్లతో హార్టికల్చర్ మిషన్‌ను ప్రారంభిస్తున్నామని, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (×ూదీ) తరహాలో "ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్"ను ఏర్పాటు చేసి వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహిస్తామని ప్రకటించారు.

## చైనా, అమెరికా ప్రత్యర్థులు కాదు..పార్టనర్స్

- మొదటి పేజి తరువాయి

సాగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. చైనా, అమెరికా రెండు గొప్ప దేశాలని, రెండు దేశాల ప్రజలు గొప్పవారని జిన్ పింగ్ తన సోషల్ మీడియా ప్లాట్ ఫాంలో రాశారు. మే నెలలో చైనా పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుపర్చుకునేందుకు ట్రంప్ అంగీకరించినట్లు జిన్ పింగ్ తెలిపారు. ఆ దిశలో పని చేయాలని, పరస్పరం సహకరించుకోవాలని, శాంతియుత హామీలతో కూడిన స్థిరమైన సంబంధాన్ని పెంపొందించుకోవాలని జిన్ పింగ్ ఆకాంక్షించారు.

## 48 గంటల్లో రాజీనామా చేయాలి..

- మొదటి పేజి తరువాయి

గుప్పించిన సీజేపీ ఆయనను దేశద్రోహిగా అభివర్ణించింది. జజుజ రాజీనామాతో పాటు, ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా జబ్రీ డిమాండ్ చేసింది. ఓటర్ లిస్టు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని కూడా సీజేపీ డిమాండ్ కోరింది.

**జ్ఞానేష్ కుమార్ పై అభిజీత్ దిప్కే విమర్శలు..**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు దిప్కే. జ్ఞానేష్ కుమార్ ఎవరు ఓటు వేయాలి, ఎవరు ఓటు వేయకూడదని అర్హతను నిర్ణయించడాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య భావననే తలకిందులు చేసిందని , జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపులో జ్ఞానేష్ కుమార్ పాత్ర ఉందని, అతనే అతిపెద్ద దేశద్రోహి అని దీప్కే ఆరోపించారు. ప్రజాస్వామ్యంలోప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.. జ్ఞానేష్ కుమార్ చర్యలతో దేశంలోని ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు అని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల పేర్లను తొలగించే లక్ష్యంగా ఓ సిస్టమ్ పనిచేసిందని దిప్కే ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఏకమైన అనేక ప్రాంతీయ నేతలను భారీ సంఖ్యలో ఓట్లు తొలగించడం ద్వారా ఓడిపోయేలా చేశారని దీప్కే అన్నారు. సర్ తో ఓట్ల తొలగింపు, బీజేపీకి కేంద్ర ఎన్నికల సంఘం చేసిన మేలును దీప్కే బట్టబయలు చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించలేకపోయింది. మెజారిటీ రాకపోవడంతో వారు ఆందోళనకు గురయ్యారు. '400 పార్' అనే నినాదం ఇచ్చినప్పటికీ, వారు 240 సీట్లకు పరిమితమయ్యారు. ఆ తర్వాత, దేశంలో ప్రజాభిప్రాయం మారుతోందని, ప్రాంతీయ శక్తులు బలపడపడ్డాయని గ్రహించిన బీజేపీ, ఎలక్షన్ కమిషన్ చీఫ్ కుట్రకు తెరలేపారని జబ్రీ వ్యవస్థాపకుడు ఆరోపించారు. ఎన్నికల్లో ప్రతిపక్ష నేతలు, ప్రాంతీయ పార్టీల చీఫ్ ల ఓటమిపై ప్రస్తావిస్తూ .. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు ,ఢిల్లీ ఉదాహరణలను ఎత్తిచూపారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే, ఎన్‌సీపీ (చీజ్రూ), ఎం.కె. స్టాలిన్, పినరయి విజయన్, అరవింద్ కేజ్రీవాల్ , మమతా బెనర్జీ... ఇలా ఈ ముఖ్యమంత్రులందరూ ఒక్కొక్కరుగా ఓడిపోయారు. ఇది యాదృచ్ఛికం కాదని, 2024 ఎన్నికల్లో ఉమ్మడిగా ప్రచారం చేసిన వారంతా ఒక్కొక్కరుగా ఎలా ఓడిపోయారని దీప్కే ప్రశ్నించారు. వీరందరి ఓటమి వెనక పక్కా ప్రణాళిక ఉందన్నారు.

# భారీ గాలులకు విద్యుత్ వైర్లపై పడిన భారీ వృక్షం.

**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 24:**ఆలమూరు మండలం మడికి జాతీయ రహదారి నుండి దుళ్ల వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ప్రక్కనగల భారీ వృక్షాలు తుఫాను వలన వీచిన భారీ గాలులకు గురువారం తెల్లవారుజామున విద్యుత్ హై టెన్షన్ వైర్లు పై పడటంతో హై టెన్షన్ వైర్లతో పాటు స్తంభం కూడా నేలపై ఒరిగింది. ఈ ప్రమాదం రాత్రి సమయంలో జరగడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కాగా విద్యుత్ శాఖ సిబ్బంది నేలకొరిగిన భారీ వృక్షాన్ని యుద్ధ ప్రాతిపదికపై కోత యంత్రాలతో తొలగిస్తున్నారు. కాగా ఈ భారీ వృక్షాలను తొలగించాలంటూ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో కొబ్బరి చెట్టు హై టెన్షన్ పై పడి నేలకొరగడంతో అది గమనించిన ఇద్దరు యువకులు ప్రాణాలు అరస్థితిలో పట్టుకొని తప్పించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు



స్పందించి పంటకాలువకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి





- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- జాతీయ రహదారులపై బ్లాక్‌స్పాట్ల గుర్తింపు
- ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయంతో చర్యలు
- గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రమాదాలు తగ్గాయి
- ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 24 :** జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదని, ప్రమాదాల కారణంగా జరిగే ప్రాణనష్టాన్ని అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.గురువారం కాకినాడ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్‌తో పాటు రవాణా,ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్,జాతీయ రహదారులు, మున్సిపల్,వైద్య తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి, ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులు, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారులు,ఆర్అండ్‌బీ రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, యాక్సిడెంట్ జోన్‌లు, సైన్‌బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులకు ఇరువైపులా పెరిగిన చెట్ల పొదలను తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత ఉండేలా చూడాలన్నారు.జాతీయ రహదారులపై లారీలు, ఇతర వాహనాలను నిలిపివేయకుండా 'నో పార్కింగ్ ఏరియా' బోర్డులు ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఏసీ బస్సుల్లో షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా వైరింగ్ తదితర భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టేలా చూడాలని, సంబంధిత బస్సు యాజమాన్యాల నుంచి భద్రతా చర్యలకు సంబంధించిన ధ్రువపత్రాలను తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**ప్రమాదాలు తగ్గినా అప్రమత్తత అవసరం: ఎస్పీ**

జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, తక్షణ నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారులపై మలుపులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్‌బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా చర్యల ఫలితంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలిపారు. అయినప్పటికీ జాతీయ రహదారులపై అతివేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, లారీలకు సంబంధించిన ప్రమాదాలు అధికంగా ఉన్నాయని వివరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠినంగా జరిమానాలు విధించాలని పోలీస్,రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కింద 4,564 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.పాఠశాలలు,కళాశాలల విద్యార్థులతో పాటు లారీ, ఆటో,ఆర్టీసీ డ్రైవర్లకు రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచాలని,ప్రథమ చికిత్స కేంద్రాలను అప్రమత్తంగా ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రియా,డీఆర్వో డి. తిప్పే నాయక్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్,సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి




**కొత్తపేట డివిజన్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు**

**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబరు 24:** తీవ్ర వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కొత్తపేట డివిజన్ అధికారులు అప్రమత్తమయ్యారు. సెప్టెంబరు 26, 27, 28 తేదీల్లో గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ డివిజనల్ అధికారి సూచించారు.భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో, డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.

కొత్తపేట ఆర్డీవో కార్యాలయ కంట్రోల్ రూమ్: 08855-244299

మండలాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు:
అయినవిల్లి: 8328177907
ఆలమూరు: 8639507819
అంబాజీపేట: 9849903890
ఆత్రేయపురం: 08855-297166
కొత్తపేట: 9059461848
పి.గన్నవరం: 9849903896
రావులపాలెం: 7207128776

గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు నది నీటిమట్టం, వర్షపాతం పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని కోరారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- మంత్రి వాసంశెట్టి సుభాష్
- రామచంద్రపురం డివిజన్‌లో 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు..
- అత్యవసర సేవల కోసం 08857-245166కు సంప్రదించాలి

రామచంద్రపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 24 : తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యవసర సేవల సమన్వయం కోసం ఆర్డీఓ పర్యవేక్షణలో సెప్టెంబర్ 24 నుంచి 28వ తేదీ వరకు రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలకు అత్యవసర సహాయం అవసరమైనప్పుడు 08857-245166 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, కాలువలు, చెరువులు, నదులు, కాజ్‌వేల వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించడం ప్రమాదకరమని, నీరు ప్రవహిస్తున్న రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.

పూరిగుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, ప్రమాదకర నిర్మాణాల్లో నివసిస్తున్న వారు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని, బలమైన గాలులు వీచే సమయంలో చెట్ల కింద, పాత భవనాల సమీపంలో ఉండరాదని తెలిపారు.సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న నిర్ధారణలేని వార్తలను నమ్మవద్దని, అధికారిక శాఖలు విడుదల చేసే సమాచారం, హెచ్చరికలను మాత్రమే విశ్వసించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబం అత్యవసర మందులు, తాగునీరు, టార్చ్‌లైట్, మొబైల్ ఫోన్, పవర్ బ్యాంక్, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని, అధికారులు జారీ చేసే సూచనలు, తరలింపు ఆదేశాలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

అత్యవసర సంప్రదింపు నంబర్లు
కార్యాలయం ,ఫోన్ నంబర్
రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూమ్ । 08857-245166
తహసీల్దార్ కార్యాలయం, రామచంద్రపురం 9849903904 ,
తహసీల్దార్ కార్యాలయం, కే.గంగవరం 8008803197
। మున్సిపల్ కమిషనర్, రామచంద్రపురం 9849905772 ,
అంబులెన్స్ / అత్యవసర సేవలు 108 / 112అప్రమత్తతే రక్షణగా భావించి అధికారుల సూచనలు పాటిస్తూ ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు.



# భారీ వర్షాన్ని లెక్కచేయని భక్తులు.. ఘనంగా గణేశ్ శోభాయాత్రలు



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 24** వినాయక చవితి వేడుకల ముగింపు సందర్భంగా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో గురువారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణేశ్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.మల్లేపల్లి కొత్తూరులో ఏర్పాటు చేసిన బాల గణపతి విగ్రహాన్ని తీన్మార్ డప్పుల నడుమ, బాణాసంచా కాలుస్తూ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. 'బోలో గణేష్ మహారాజ్ కీ జై' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. హోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా భక్తులు సంప్రదాయబద్ధంగా గణనాథుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు. అలాగే తాళ్లూరు, నీలాద్రి రావు పేట తదితర గ్రామాలలో భారీ ఊరేగింపు నృత్యాలతో, తీన్మార్ డబ్బులతో ముఖ్యంగా మహిళా మణులు నృత్యం పలువురిని ఆకట్టుకుంది. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గణనాథుని సాగనంపడం విశేషం

# వాన బీభత్సం.. అధికారులు అలర్ట్!

**శరవేగంగా సహాయక చర్యలు**

**నేలకొరిగిన భారీ వృక్షాలు.. విరిగిన విద్యుత్ స్తంభాలు**

**తప్పిన ఇబ్బందులతో ఊపిరి పీల్చుకున్న వాహనదారులు, ప్రజలు**





**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ ,24** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కాకినాడ జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరగడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి, వైర్లు తెగిపడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

తుఫాను ప్రభావంతో గండేపల్లి మండలం పి.సూరంపాలెంలో భారీ వృక్షం రహదారిపై కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కె.హరికృష్ణ సత్యారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి అక్కడికి చేరుకుని రహదారిపై పడిన చెట్టును తొలగించే చర్యలను పర్యవేక్షించారు. దీంతో రాకపోకలకు అంతరాయం తొలగిపోయింది.

అదేవిధంగా రామయ్యపాలెం గ్రామంలో భారీ వృక్షం నేలకొరగడంతో విద్యుత్ స్తంభం విరిగి వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డిప్యూటీ ఎంపీడీవో శిరీష పర్యవేక్షణలో మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భారీ వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. మరో రోజు ఇదే స్థాయిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం, అధికారులు జారీ చేస్తున్న ముందస్తు సూచనలను పాటించాలని కోరారు.

# కిర్లంపూడి మండలంలో 650 ఎకరాల్లో వరి పంట నీట మునక.

**-నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ఏఓ నాగం సుధామాధురి.**



**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్, 24:**తుఫాన్ ప్రభావంతో కిర్లంపూడి మండలంలో రామకృష్ణాపురం,చిల్లంగి,కిర్లంపూడి గ్రామాల్లో వ్యవసాయ అధికారిణి నాగం సుధామాధురి పర్యటించి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏవో సుధా మాధురి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మండలంలో సుమారు 650 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు.పంటను ముంపు ప్రభావం నుంచి కాపాడుకునేందుకు రైతులు పొలాల్లో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు తీయాలని సూచించారు.ఇందుకోసం పిల్ల కాలువలు ఏర్పాటు చేసుకోవాలని,అవసరమైన చోట ఆయిల్ ఇంజిన్లను ఉపయోగించి నీటిని బయటకు తోడాలని తెలిపారు.వర్ష ప్రభావం తగ్గిన వెంటనే వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 200 గ్రాములు,కాపర్ ఆక్సీక్లోరైడ్ 400 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.ఈ పర్యటనలో ఏఈఓ ఎన్. సీతారామమూర్తి,వీఏఏ పార్వతి పాల్గొన్నారు.

## భక్తి పారవశ్యంలో గణనాథుని నిమజ్జనం



**రావులపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 24:**విఘ్నవినాశకుడైన గణనాథుని నవరాత్రి ఉత్సవాలు భక్తుల భక్తి ప్రపత్తులు, ఆధ్యాత్మిక శోభల మధ్య పరిపూర్ణమయ్యాయి. తొమ్మిది రోజులపాటు విశేష పూజలు, అర్చనలు, హారతులతో కొలువుదీరిన గణనాథుని నిమజ్జన మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు.రావులపాలెం సీఆర్సీ రోడ్డు మొదటి వీధిలో నందం వీర వెంకట సత్యనారాయణ నివాసం వద్ద ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి నిమజ్జనానికి ముందు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భజన సంకీర్తనల నడుమ గణనాథుని విగ్రహాన్ని ఊరేగింపుగా తరలించారు. భక్తుల గణపతి నామస్మరణలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.
నిమజ్జనోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొనగా, మహిళలు భక్తిపారవశ్యంతో గణనాథునికి వీడ్కోలు పలికారు. అనంతరం సమీప కాలువ వద్ద సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి గణనాథుని విగ్రహాన్ని జలప్రవాహంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు గణనాథుని అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు,శాంతిసౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధించాలని ప్రార్థించారు.తొమ్మిది రోజులపాటు కొనసాగిన గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రతిబింబించేలా సాగి, నిమజ్జనంతో భక్తి భావోద్వేగాల మధ్య ముగిశాయి.

## ఏకగ్రీవంగా ఎల్ఐసీ ఏజెంట్ల నూతన కార్యవర్గం

**ఏజెంట్ల సమస్యలు, సంస్థ అభివృద్ధిపై విస్తృత చర్చ**




**రావులపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 24:**రావులపాలెం ఎల్ఐసీ బ్రాంచ్ ఏజెంట్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక పార స్వచ్ఛంద సేవా సంస్థ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏజెంట్ల సంక్షేమం, సంస్థాగత బలోపేతం, వ్యాపార విస్తరణ, పాలసీదారులకు అందించాల్సిన మెరుగైన సేవలపై సుదీర్ఘంగా చర్చించారు.సమావేశానికి రాజమండ్రి డివిజనల్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు రావుల మాధవరావు, ప్రధాన కార్యదర్శి మాలే నాగబాబు, కోశాధికారి పి.రెడ్డమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఏజెంట్ల ప్రయోజనాల పరిరక్షణతోపాటు సంస్థ ప్రగతికి మరింత సమష్టి కృషి అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేవలను విస్తృతం చేసి పాలసీదారుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా, అధ్యక్షుడిగా ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పులిదిండి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎలమర్తి సీతారాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం పలువురు అభినందనలు తెలిపారు. అసోసియేషన్‌ను మరింత పటిష్టపరుస్తూ ఏజెంట్ల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.
కార్యక్రమంలో జోనల్ ఈసీ మెంబర్ కంచర్ల సాంబమూర్తి, డివిజన్ ఉపాధ్యక్షుడు తులా రామారావు, డివిజన్ ఈసీ మెంబర్ మట్టపర్తి శ్రీనివాసరావుతోపాటు పెద్ద సంఖ్యలో ఎల్ఐసీ ఏజెంట్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుమల వాడపల్లిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసు

- కుటుంబ సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 24:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని తిరుపతి నియోజకవర్గ శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసు గురువారం కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శిష్ట కుటుంబరావు, పెండ్యాల భవానీ స్వామి కలిసి స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, భక్తులకు అందుతున్న సేవలు, దేవస్థానంలో కొనసాగుతున్న కార్యక్రమాలపై ఎమ్మెల్యే ఆరా తీసినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## టీడీపీ ఎంపీటీసీలకు ఘన సత్కారం..రాబోయే ఎన్నికలకు కార్యాచరణ



కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 24: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒత్తిళ్లు, బెదిరింపులు ఎదురైనా తెలుగుదేశం పార్టీ తరఫున ఎంపీటీసీలుగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేసిన వారి సేవలను ఆయన అభినందించారు.కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో గురువారం ఇటీవల పదవీకాలం పూర్తిచేసుకున్న తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘనంగా సత్కరించారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చెందిన మట్టా లక్ష్మి, రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన సకినాల నాగజ్యోతి గణపతి, కేతరాజుపల్లికి చెందిన పమ్మి శాంతికుమారి, వెదిరేశ్వరానికి చెందిన గంటా సుబ్బారావు, ఆలమూరుకు చెందిన గంగుల నాగజ్యోతి, జొన్నాడకు చెందిన మారిశెట్టి శ్రీనివాస్, కొత్తపేట మండలం మోడేకుర్రుకు చెందిన రెడ్డి శ్రీనివాస్, మందపల్లికి చెందిన సిద్ధంశెట్టి సత్యనారాయణ, వానపల్లికి చెందిన మాకే నాగభూషణం, బల్ల సుధారాణి, బిల్లకుర్రుకు చెందిన చిత్రపు ఆనంద్‌లను ఎమ్మెల్యే సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్ల కాలంలో గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రజల్లో తగిన గౌరవం లభిస్తోందన్నారు.గతంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించి పార్టీ కోసం నిలబడిన ఎంపీటీసీల సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థులను ప్రతి స్థానంలో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే బండారు సమీక్ష



**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబరు 24:** నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులను ఆదేశించారు. భూసేకరణ, డ్రైనేజీ, సర్వీస్ రోడ్లు, కల్వర్టులు, జంక్షన్ల అభివృద్ధి తదితర అంశాలపై గురువారం కొత్తపేటలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ బి.కృష్ణమూర్తి, ఆర్డీవో జి.వి.వి.సత్యనారాయణతోపాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా రహదారి నిర్మాణం, విస్తరణ పనుల పురోగతిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, సర్వీస్ రోడ్ల నిర్మాణం, కల్వర్టులు, ప్రధాన కూడళ్ల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు.జాతీయ రహదారి పనుల వల్ల ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుకుని పనుల్లో జాప్యం లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందేలా జాతీయ రహదారి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జాతీయ రహదారి, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నిండుతున్న సుబ్బారెడ్డి సాగర్



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 24:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ సుబ్బారెడ్డి సాగర్‌కు భారీ వర్షాల కారణంగా నీరు చేరడంతో జలకళ ఉట్టిపడుతుంది. గత కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులతో సాగునీటి లభ్యతపై రైతుల్లో ఆందోళన నెలకొంది.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో సాగునీటి అవసరాలకు నీటిని వినియోగించరాదంటూ జిల్లా కలెక్టర్ సైతం ఆదేశాలు జారీ చేశారు.తాజాగా కురిసిన భారీ వర్షాలతో సుబ్బారెడ్డి సాగర్‌లోకి భారీగా వరదనీరు చేరింది.దీంతో సాగర్‌లో నీటి మట్టం గణనీయంగా పెరిగి కళకళలాడుతోంది.సాగర్‌కు జలకళ రావడంతో పరిసర ప్రాంతాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.వర్షాలు ఇలాగే కొనసాగితే సుబ్బారారెడ్డి సాగర్‌లో నీటి నిల్వలు మరింత పెరిగి పంటల సాగుకు ఉపయోగపడతాయని సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం





**సామాజిక సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి**

**188 మంది విద్యార్థులతో సేవా ప్రతిజ్ఞ**

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** ఆదిత్య యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్) డా. ఎస్. రమాశ్రీ, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ యాక్టివిటీస్ డా. డి. కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. 'నాట్ మీ బట్ యూ -- నేను కాదు, నువ్వు' అనే ఎన్ఎస్ఎస్ నినాదం సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.
ఆరోగ్య అవగాహన, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, రక్తదానం, విద్య, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 188 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సామాజిక సేవకు అంకితమై పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
కార్యక్రమంలో ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డా. ఐ.వి. వీరాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శిశువును పరామర్శించిన గంగ సూర్యనారాయణ





**బాలికకు విద్య, వైద్యం, మానసిక సహాయం, పునరావాస సేవలు అందేలా చర్యలు**

**తాళ్లరేవు/కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 24:** తాళ్లరేవు మండలానికి చెందిన పోక్సో కేసు బాధిత ఎనిమిదేళ్ల బాలికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గంగ సూర్యనారాయణ గురువారం పరామర్శించారు. కాకినాడలోని వన్‌స్టాప్ సెంటర్‌లో తాత్కాలిక సంరక్షణ పొందుతున్న బాలికను తాళ్లరేవు గ్రామానికి చెందిన నడింపల్లి వినోద్‌తో కలిసి ఆయన కలిశారు. ఈ సందర్భంగా బాలిక ఆరోగ్య పరిస్థితి, భద్రత, సంక్షేమం, అందుతున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికకు అవసరమైన విద్య, వైద్యం, మానసిక సహాయం, పునరావాస సేవలను ప్రభుత్వం ద్వారా అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకుంటాయని గంగ సూర్యనారాయణ తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న బాలికకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా భరోసా కల్పించారు. అనంతరం చట్టవిరుద్ధ దత్తతకు సంబంధించిన కేసులో భాగంగా శిశుగృహంలో తాత్కాలిక సంరక్షణ పొందుతున్న మూడు నెలల శిశువును ఆయన పరామర్శించారు. అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్న శిశువు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవలు, కొనసాగుతున్న చికిత్స తదితర వివరాలను వైద్య బృందం నుంచి సేకరించారు. శిశువుకు మెరుగైన వైద్యం, నిరంతర వైద్య పర్యవేక్షణ, ప్రత్యేక సంరక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య బృందాన్ని కోరారు. శిశువు ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య, పోషణ, సంరక్షణ సేవలను సంబంధిత శాఖల సమన్వయంతో అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జాగరపు విజయ, వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు శైలజ, చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయకర్తలు విజయ్, నాగలక్ష్మి, కేసు వర్కర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోలంకలో వర్షానికి పెంకుటిల్లు కూలివేత



**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వీచిన ఈదురుగాలులకు కాజులూరు మండలం కోలంక గ్రామంలో ఓ పెంకుటిల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన పాలిక సీతామహాలక్ష్మి, భర్త పాలిక చంద్రరావుకు చెందిన ఇల్లు వర్షాలకు దెబ్బతిని పూర్తిగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహా నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంటి పరిస్థితిని పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# అక్టోబర్ 1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**కాకినాడ జిల్లాలో 2,64,865 మంది లబ్ధిదారులకు రూ.115.61 కోట్లు విడుదల**

**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** అక్టోబర్ 2026 నెలకు సంబంధించి కాకినాడ జిల్లాలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ. 115.61 కోట్ల నిధులను విడుదల చేసినట్లు డీఆర్డీఏ పథక సంచాలకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులకు చెందిన 2,64,865 మంది పింఛనుదారులకు ఈ నిధులను పంపిణీ చేయనున్నారు.

అక్టోబర్ 1వ తేదీ ఉదయం పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదు ఉపసంహరణ చేపట్టాలని, అదే రోజు మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకు శాఖల్లో తగినంత నగదు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు బ్యాంకు కంట్రోలర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్లకు (ఎల్‌డీఎంలు) డీఆర్డీఏ అధికారులు ముందస్తు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) వాటాకు సంబంధించిన పింఛను మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు బదిలీ (డీబీటీ) విధానంలో జమ చేసే ప్రక్రియను ముందుగా విజయనగరం జిల్లాలోని గజపతినగరం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు.

అక్టోబర్ 1న పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పథక సంచాలకులు తెలిపారు.

# కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు గురువారం సాయంత్రం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. తన పదవీకాలంలో పరిపాలనాపరంగా చక్కని సహకారం అందించినందుకు కలెక్టర్‌కు వేణుగోపాలరావు కృతజ్ఞతలు తెలిపారు. గురువారంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా తన పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, బుధవారం నిర్వహించిన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ ఆత్మీయ అభినందన సమావేశానికి కలెక్టర్ హాజరైనందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ





- **బుక్ చేసుకున్న వారికి సకాలంలో సిలిండర్లు సరఫరా చేయాలి**
- **డెలివరీ సమయంలో అదనపు వసూళ్లు చేయొద్దు**

**కాకినాడ/తొండంగి, పెన్ పవర్, సెప్టెంబర్ 24 :** గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జాప్యం, డెలివరీ పెండింగ్‌పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ గురువారం తొండంగిలోని వైష్ణవి దేవి గ్యాస్ ఏజెన్సీని స్థానిక అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ కార్యాలయంలోని రిజిస్టర్లు, ఆన్‌లైన్ గ్యాస్ బుకింగ్ వివరాలు, సిలిండర్ల డెలివరీ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న బుకింగ్‌లు, సరఫరాలో జాప్యానికి గల కారణాలపై ఏజెన్సీ ప్రతినిధులను ఆరా తీశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ, తొండంగి ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ల డెలివరీ పెండింగ్ ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్న నిర్ణీత సమయంలోపు సిలిండర్లు సరఫరా చేయాలని ఆదేశించారు. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారందరికీ ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందించాలని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సమయంలో డెలివరీ సిబ్బంది వినియోగదారుల నుంచి ఎలాంటి అదనపు సొమ్ము వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. ఈ తనిఖీలో జాయింట్ కలెక్టర్ వెంట తొండంగి మండల తహసీల్దార్ కాంతారావు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జగ్గంపేటలో గణేష్ నిమజ్జనాలు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 24 :** గణపతి నవరాత్రులు ముగియడంతో గురువారం జగ్గంపేట మండలంలో అనేక చోట్ల వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో జ్యోతుల గణేష్, కృష్ణ టాక్సీ స్టాండ్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. డీజే సౌండ్స్, తీన్మార్ డాన్సులతో, టపాసులు కాలుస్తూ, జై బోలో గణపతి మహారాజ్ కీ జై, గణపతి బప్పా మోరియా అంటూ హోరెత్తే నినాదాలు చేసుకుంటూ రామవరం పోలవరం కాలవ వరకు ఊరేగించి, అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

# తుఫాను బాధిత కుటుంబాలకు, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

- ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
- ముంపుకు గురైన వేలంక, వీరవరం గ్రామాలలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యటన.






**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 24:** ముంపుకు గురైన తుఫాను బాధిత కుటుంబాలను, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు, లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహాలు నీట మునిగాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న ఈ వర్షాల నేపథ్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం కిర్లంపూడి మండలం వేలంక, వీరవరం గ్రామాలలో పర్యటించారు. జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మోకాళ్ళ లోతు వరద నీటిలోకి దిగి స్వయంగా ముంపు బాధితులను పరామర్శించడమే కాకుండా, కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను, వరద నీటిలో చిక్కుకున్న ఇళ్లను స్వయంగా పరిశీలించి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, వరద ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తడిసిన గోడలకు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, పంట నష్టపోయిన రైతులను, ఇళ్లు ముంపునకు గురైన బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిడిఓ, బాయిశెట్టి హరికృష్ణ, తహసీల్దార్, కె సాయికిరణ్, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, తూము కుమార్, గండే కాశీ, ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.2.50 కోట్లు

**84 గ్రాముల బంగారం.. 1.617 కిలోల వెండి.. 13 దేశాల కరెన్సీ నోట్లు**





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 24:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ప్రధాన ఆలయంతో పాటు శ్రీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయ హుండీల ద్వారా రూ. 2,04,24,921 నగదు సమకూరగా, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ. 45,86,750 ఆదాయం లభించింది. మొత్తంగా రూ. 2,50,11,671 నగదు హుండీ ఆదాయంగా లభించినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపులో 84 గ్రాముల బంగారం, 1 కిలో 617 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా భక్తులు సమర్పించిన కానుకల్లో వివిధ దేశాలకు చెందిన 86 విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్, మలేషియా, సింగపూర్, ఆస్ట్రేలియా, అమెరికా, నేపాల్, యూరప్, కెనడా, ఇంగ్లండ్ తదితర దేశాల కరెన్సీ నోట్లు లభించినట్లు పేర్కొన్నారు.

హుండీ లెక్కింపు ప్రక్రియను దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు, గ్రామస్థులు, పోలీసు సిబ్బంది, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సేవకులు, దేవస్థానం సిబ్బంది, బ్యాంకు ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు. రావులపాలెంలోని కోస్టల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ సిబ్బంది కూడా లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు శ్రీమతి పి. భవాని, ఎస్. సూర్య కుటుంబరావు, అర్చకులు వి. సుందర శేషావతారం పాల్గొన్నారు. పర్యవేక్షణాధికారులుగా అమలాపురం అసిస్టెంట్ కమిషనర్, జిల్లా దేవదాయ శాఖ అధికారి వి. సత్యనారాయణ, గ్రూపు దేవాలయాల ఈఓ గ్రేడ్--×× ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, ఈఓ గ్రేడ్--××× వై. సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. దేవస్థానం చైర్మన్, ధర్మకర్తల మండలి ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఈఓ, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా హుండీ ద్వారా భారీగా కానుకలు సమకూరడం విశేషమని దేవస్థానం వర్గాలు పేర్కొన్నాయి.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి-ఆర్డీఓ మల్లిబాబు



**కాకినాడ రూరల్,పెన్ పవర్,సెప్టెంబర్ 24 :** తీవ్ర వాయుగుండం తీరం దాటిన నేపథ్యంలో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఆర్డీఓ, కాకినాడ రూరల్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్. మల్లిబాబు సూచించారు.గురువారం కాకినాడ రూరల్ మండలంలోని రమణయ్యపేట, తిమ్మాపురం అవంతినగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించి ముంపు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా ఇరిగేషన్ డ్రైన్లను శుభ్రం చేసి, మురుగునీరు తక్షణమే బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, డ్రైనేజీ, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రమణయ్యపేట ఛానల్‌ను పరిశీలించిన ఆర్డీఓ, ఛానల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపునకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని, ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఆర్డీఓ వెంట ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ పోతురాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భవాని, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- ఎన్టీఆర్ బీచ్‌లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన ఎస్పీ బిందు మాధవ్
- వర్షంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు అభినందనలు





**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 24 :** తుఫాను ప్రభావంతో ప్రతికూల వాతావరణం, ఎడతెరిపి లేని వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ క్రమంలో గురువారం కాకినాడలోని ఎన్టీఆర్ బీచ్ వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జన ఘాట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. తుఫాను ప్రభావం దృష్ట్యా సముద్ర తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనానికి వచ్చే భక్తులు, ప్రజలు సముద్రంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన ఘాట్ల వద్ద నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గణేష్ ఉత్సవ కమిటీలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. తుఫాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిమజ్జన కార్యక్రమాలను వీలైనంత త్వరగా, సురక్షితంగా పూర్తి చేసేలా నిర్వాహకులకు సహకరించాలని తెలిపారు.ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైన్‌కోట్లు ధరించి నిమజ్జన ఘాట్లు, ట్రాఫిక్ కూడళ్లు, ఊరేగింపు మార్గాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా భావించి ప్రతికూల వాతావరణంలోనూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు భరోసా కల్పిస్తూ విధులు నిర్వహించాలని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు.

## జోరు వానలోనూ ప్రత్తిపాడు మండలం వీఆర్ఏలు నిరవధిక సమ్మె.

-9 వ రోజూ తమ న్యాయమైన కోరికలు అమలు చేయాలని డిమాండ్.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్,22:** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ప్రత్తిపాడు మండలం వి ఆర్ ఏ లు డిమాండ్ చేసారు. ఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చేపెట్టిన నిరవధిక సమ్మె గురువారం 9వ రోజుకు చేరుకుంది. 9 వ రోజు జోరు వానలోనూ సహాయ నిరాకరణ ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల అందరికీ తెలంగాణ తరహాలో పే స్కేలు తక్షణమే అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలు అందర్నీ వన్ టైం సెటిల్మెంట్ వి.ఆర్.ఓ లు గా నియమించాలని,అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బురా తాతబ్బాయి, గుండె బాబ్జి, మురా శోభా, రెల్లి యేసు, బురా సత్యన్నారాయణ, చాపల బాబ్జి, వేమగిరి అభిలాష్, పెదపూడి కొండబాబు, పలివెల అనిల్ కుమార్ మండలంలోని పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- జిల్లాలో 17 డ్రగ్స్ హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక నిఘా
- 715 విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు
- మహిళలు, బాలికల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత
- నెల రోజుల్లో సమీక్షా నిర్ణయాల అమలు




**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 24 :** జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారంతో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు విద్యాసంస్థల్లో సురక్షిత వాతావరణం కల్పించాలని స్పష్టం చేశారు.గురువారం కాకినాడ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్‌తో కలిసి కలెక్టర్ నార్కొటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 17 డ్రగ్స్ హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలని సూచించారు.ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు, 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా ఉంచాలని, విద్యార్థులకు సురక్షితమైన క్యాంపస్ వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమాలను అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 715 పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన అన్ని విద్యాసంస్థల్లోనూ వీటిని ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. డ్రగ్స్ సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి, సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ చర్యలు చేపట్టాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారిలో ఉన్న అపోహలు, భయాందోళనలను తొలగించాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ బిందు మాధవ్ ఇతర అధికారులతో కలిసి 'రైస్ ఎగైనెస్ట్ గాంజా' గోడపత్రికను ఆవిష్కరించారు.

**మహిళలు, బాలికల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత**

మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మహిళలపై నమోదైన కేసులను సమీక్షిస్తూ, నేరాల విచారణను త్వరితగతిన పూర్తి చేసి దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని స్పష్టం చేశారు. స్పీడ్ ట్రయల్స్ ద్వారా త్వరగా తీర్పులు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనుమానితులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా పోలీసులు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించాలని,కొత్తగా వివాహమైన మహిళలు, కౌమారదశ బాలికలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, రద్దీ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. విద్యాసంస్థల పరిసరాల్లో వెలుతురు లేని ప్రాంతాలు, శిథిల భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, లీప్ యాప్‌లో విద్యాసంస్థల పరిసర ప్రాంతాల సమాచారాన్ని నమోదు చేసి పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలన్నీ రాబోయే నెల రోజుల్లోగా క్షేత్రస్థాయిలో వంద శాతం అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు.

## ఏలేరు జలాశయానికి జలకళ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గురువారం నాటికి ఏలేరు జలాశయానికి జలకళ వచ్చింది. గత నాలుగు రోజులుగా ఏలేరు ప్రాంతాల్లో వర్షాలు కురిసినప్పటికీ నీరు చేరలేదు. కానీ గత 48 గంటలుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు రిజర్వాయర్లో జలకళ సంతరించుకుంది. 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టిఎంసిల నీటి సామర్థ్యం ఉన్న జలాశయం ప్రస్తుతానికి 78.85 మీటర్ల స్థాయిలో 12. 15 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రిజర్వాయర్కు ఇంకా నీటి సామర్థ్య కెపాసిటీ ఉన్నందువల్ల దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేసే అవకాశం లేదని ఏలూరు అధికారులకు తెలిపారు. కాగా 14, 927 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్కు వచ్చి చేరుతుందని, దీనిలో విశాఖపట్నం కి లెఫ్ట్ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కులు , తిమ్మరాజు ట్యాంకు కు50 క్యూసెక్కులు మొత్తం 250 క్యూసెక్కును అవుట్ ఫ్లోస్ గా విడుదల చేస్తున్నామని ఏలేరు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

## డీజేల హోరు గణేష్ నిమజ్జనాల జోరు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** డీజేల హోరు ఏలేశ్వరం ప్రధాన రహదారులు దద్దరిల్లాయి. ఎడతెరిపిలేని వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గురువారం గణేష్ నిమజ్జనాల జోరు సాగింది. ఒక ప్రక్క జోరుగా మరోవైపు ఈదురు చలిగాలను సైతం లెక్కచేయకుండా యువకులు గణేష్ నిమజ్జనాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా జరిగిన గణేష్ నిమజ్జన ఉత్సవాలకు ఏలేరు ప్రధాన కాలువకు గణనాథులు క్యూ కట్టారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో రెండు రోజులపాటు మండపాల్లో విశిష్ట పూజలు అందుకున్న గణనాథులను మండపాల కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులు జోరు వానలో తడుస్తూ తీన్మార్ డబ్బులకు, డీజే శబ్దాలకు లయబద్ధమైన డ్యాన్సులు చేస్తూ యువతీ యువకులు ఉత్సాహభరితంగా గణేష్ నిమజ్జనాల్లో పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షాలు

**గండేపల్లిలో 14.4 మి.మీ. వర్షపాతం నమోదు**

**పెన్ పవర్ ప్రతినిధి(కాకినాడ), సెప్టెంబర్ 24:** కాకినాడ జిల్లాలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 319.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 15.2 మి.మీ.లిగా నమోదైనట్లు అధికారిక నివేదిక వెల్లడించింది. గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు తాళ్లరేవులో అత్యధికంగా 30.8 మి.మీ., కరపలో 23.4 మి.మీ., సామర్లకోట, కాజులూరులో 22.6 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. కాకినాడ రూరల్‌లో 19.2 మి.మీ., పెద్దాపురంలో 18.6 మి.మీ., కాకినాడ అర్బన్‌లో 18.4 మి.మీ. వర్షం కురిసింది.

గండేపల్లి మండలంలో 14.4 మి.మీ., జగ్గంపేటలో 13.2 మి.మీ., పేడపూడిలో 13.2 మి.మీ., ప్రత్తిపాడులో 12.2 మి.మీ., గొల్లప్రోలు, పిఠాపురంలో 11.2 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఇక సెప్టెంబర్ 23 ఉదయం 8.30 గంటల నుంచి సెప్టెంబర్ 24 ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో 2,470.0 మి.మీ. వర్షపాతం నమోదవగా, జిల్లా సగటు లి117.6 మి.మీ.లిగా నమోదైంది. ఈ సమయంలో జగ్గంపేటలో 150.4 మి.మీ., పెద్దాపురంలో 150.6 మి.మీ., సామర్లకోటలో 146.8 మి.మీ., తాళ్లరేవులో 146.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## తుఫాన్ బాధిత కుటుంబానికి టీడీపీ నేత నిమ్మకాయల రంగనాగ్ రూ.5 వేల ఆర్థిక సాయం





**సామర్లకోట/కాకినాడ రూరల్, పెన్ పవర్,సెప్టెంబర్ 24:** తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన కుటుంబాలకు అండగా నిలిచేందుకు కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాగ్ ముందుకు వచ్చారు. గురువారం సామర్లకోట పట్టణంలోని పలు ముంపు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ముందుగా బ్రౌన్‌పేట అంబేద్కర్ కాలనీలో వర్షాలకు కూలిపోయిన ఇంటిని పరిశీలించి, ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున కూడా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం జగనన్న కాలనీ, సత్యనారాయణపురం, ఎఫ్‌సీఐ కాలనీల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో అధికారులతో కలిసి కాలినడకన పర్యటించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బురదమయమైన రహదారులపై తిరుగుతూ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు.రైల్వే బ్రిడ్జి కింద డ్రైనేజీ వ్యవస్థ మూసుకుపోవడం వల్లే ఆయా కాలనీలు జలమయ మవుతున్నట్లు గుర్తించిన అధికారులు, డ్రైనేజీని వెంటనే శుభ్రం చేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించే చర్యలు చేపట్టారు. ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా రంగనాగ్ అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు మండల ప్రత్యేకాధికారిగా వి వి వి సత్యనారాయణ.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 24:**ప్రత్తిపాడు మండల ప్రత్యేక అధికారిగా కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ ఎస్ ఏ)అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు,సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు.ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.మండలంలో ప్రజలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని తెలిపారు.మండల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయాలని ప్రత్యేక అధికారి వి వి వి సత్యనారాయణ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ ఎంవీఆర్ కుమార్ బాబు,ఏఓ ఎ వి ఆర్ ఎస్ ఎన్ మూర్తి పాల్గొన్నారు.



## కొత్తపేటలో బీభత్సం సృష్టించిన కారు..

# షాపులపైకి దూసుకెళ్లిన వైనం





**కొత్తపేట, పెన్ పవర్,సెప్టెంబరు 24:** :అదుపుతప్పిన కారు షాపులపైకి దూసుకెళ్లిన ఘటన కొత్తపేట మార్కెట్ సెంటర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మార్కెట్ సెంటర్‌లోని వినాయకుని ఆలయం ఎదురుగా గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఓ కారు వేగంగా వస్తూ ఒక్కసారిగా అదుపుతప్పింది.కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న దుకాణాల వైపు దూసుకెళ్లింది. షాపుల మెట్ల వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ స్టాండ్లను ఢీకొట్టడంతో అవి ధ్వంసమయ్యాయి. అక్కడ ఉన్న ఇటుకలు కూడా చెల్లాచెదురయ్యాయి. తెల్లవారుజామున సమయం కావడంతో దుకాణాల వద్ద జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాద సమయంలో కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నట్లు స్థానికులు తెలిపారు.కారు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిద్రమత్తులో అధిక వేగంతో కారు నడపడం వల్లే అదుపుతప్పి ఉండవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే కారు టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పిందని డ్రైవర్ చెబుతున్నట్లు తెలిసింది.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కారు ఎలా అదుపుతప్పింది, ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో దుకాణాల వద్ద ఉన్న సామగ్రి ధ్వంసం కావడంతో నష్టం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు పూర్తయిన అనంతరం ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## తుఫాన్ ప్రభావంతో ఒమ్మంగి -శరభవరం రహదారి మూసివేత.

**-శరభవరం,పోతులూరు,చింతలూరు ప్రజలు కొడవలి మీదుగా వెళ్లాలి.**

**-మూసివేసిన రహదారి వైపు ఎవరూ వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక.**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 24:**ప్రత్తిపాడు మండలంలో తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఒమ్మంగి-శరభవరం రహదారిని తాత్కాలికంగా మూసివేశారు.రహదారిపై వర్షపు నీరు చేరి ప్రమాదకర పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా రాకపోకలను నిలిపివేసినట్లు ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం,తహశీల్దార్ ఎం సూర్యప్రభ,ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు.ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రహదారి గుండా ప్రయాణించవద్దని ప్రజలకు అధికారులు సూచించారు.ఒమ్మంగి నుండి శరభవరం వైపు వెళ్లే వారు ఉత్తరకంచి,పొదురుపాక మీదుగా వెళ్లాలని సూచించారు.అలాగే శరభవరం,పోతులూరు,చింతలూరు తదితర గ్రామాల ప్రజలు కొడవలి మీదుగా రాకపోకలు సాగించాలని అధికారులు సూచించారు.రహదారి పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించవద్దని,ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ అవసరాల గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ అండ

**125 మందికి రూ.62.44 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**





**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబరు 24:** వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గురువారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అత్యవసర వైద్య చికిత్సలకు ఆర్థిక సహాయం అందించే విధానం అమల్లో ఉంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఉన్న శ్రద్ధకు సీఎంఆర్ఎఫ్ కార్యక్రమం నిదర్శనమన్నారు. ఆసుపత్రుల్లో చికిత్సకు అయిన ఖర్చులను బట్టి అర్హత మేరకు సహాయం అందిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 40 దఫాల్లో 1,958 మందికి రూ.12,43,63,630 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించినట్లు వెల్లడించారు.గురువారం జరిగిన కార్యక్రమంలో ఆత్రేయపురం మండలానికి చెందిన 25 మందికి రూ.9,99,982, రావులపాలెం మండలానికి చెందిన 40 మందికి రూ.21,37,358, కొత్తపేట మండలానికి చెందిన 37 మందికి రూ.16,62,025, ఆలమూరు మండలానికి చెందిన 23 మందికి రూ.14,44,747 చొప్పున మొత్తం 125 మందికి రూ.62,44,112 విలువైన చెక్కులను అందజేశారు. వీటిలో 123 చెక్కులు చికిత్స అనంతరం ఖర్చుల రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించినవి కాగా, రెండు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లు ఉన్నాయి.

పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులకు కూడా త్వరితగతిన మంజూరు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని పేద కుటుంబాలకు వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ అర్ధనగ్న ప్రదర్శన.



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**మండల కేంద్రమైన ఆలమూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట గల ధర్నా చౌక్ లో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం చేస్తున్న నిరవధిక సమ్మె గురువారంనాటికి 9వ రోజుకు చేరింది. మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో జోరువానలో శిబిరం వద్ద అర్దనగ్న ప్రదర్శనచేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని వారు అర్ధనగ్న ప్రదర్శన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలమూరు మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇషాక్ సెక్రటరీ కె శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారుడు నాగేశ్వరరావు, మండల వీఆర్ఏలు దీక్షలో పాల్గొని నినాదాలు చేశారు.

## తుఫాన్ ప్రభావంతో టేకి డ్రెయిన్‌పై రాకపోకలు నిలిపివేత

- కాజులూరు--దుగ్గుదూరు కాజ్‌వే దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేత



**కాజులూరు,పెన్ పవర్ ,సెప్టెంబర్ 24:** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కాజులూరు మండలంలో టేకి డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో కాజులూరు--దుగ్గుదూరు గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వే దెబ్బతింది.దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఈ మార్గంలో రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

డ్రెయిన్‌పై వరద నీరు ఉధృతంగా ప్రవహించడం,రహదారి దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ప్రమాదం పొంచి ఉండటాన్ని గుర్తించిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే దుగ్గుదూరు గ్రామానికి వెళ్లేందుకు మరో రెండు ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయని,వాటి ద్వారా రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేవని తహసీల్దార్ జి.ఆర్.ఠాగూర్ తెలిపారు.తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వరద నీరు ప్రవహించే డ్రెయిన్లు,కాలువలు, దెబ్బతిన్న రహదారులపై ప్రయాణాలు చేయరాదని అధికారులు సూచిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, అధికారుల సూచనలు పాటించాలని తహశీల్దార్ కోరారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో శంఖవరం రోడ్డుకు మహర్దశ...

- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మెయిన్ రోడ్డుకు రూ.1.50 కోట్లు మంజూరు...
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కలెక్టర్‌కు ఎమ్మెల్యే సత్యప్రభ కృతజ్ఞతలు...



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 24:-** దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు మహర్దశ కల్పిస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మరో ముందడుగు వేశారు.ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో శంఖవరం మెయిన్ రోడ్డు అభివృద్ధికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి.శంఖవరం ప్రధాన రహదారి అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం లభించనుంది. రహదారి అభివృద్ధి పూర్తయితే ప్రజలు,వాహనదారుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రహదారి మెరుగు పడటంతో శంఖవరం ప్రాంతంలో మౌలిక వసతులు బలోపేతమై ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులను గుర్తించి వాటి అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యప్రభ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారు.శంఖవరం మెయిన్ రోడ్డు అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్,రాష్ట్ర మంత్రి నారా లోకేష్, కాకినాడ జిల్లా కలెక్టర్ ఎన్ హరేంధిర ప్రసాద్‌కు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## 5 కోట్ల వత్తులతో సముద్రునికి మహా కుంభహారతి



**కాకినాడ రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 24:** సామూహిక గణపతి విగ్రహాల నిమజ్జనం సందర్భంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేట సముద్ర తీరంలో జిల్లా గణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఐదు కోట్ల వత్తులతో సముద్రునికి మహా కుంభహారతి నిర్వహించారు. స్వయంభు భోగి గణపతి పీఠం నుంచి నవరాత్రి దీక్షలు చేపట్టిన 108 మంది మహిళలు సముద్ర తీరానికి చేరుకుని కన్నుల పండువగా హారతి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ గోదావరి నదికి గంగా హారతి ఇచ్చినట్లుగా, 12 నదులు కలిసే సముద్రునికి పూర్ణకుంభ హారతి ఇవ్వడం సనాతన హిందూ సంప్రదాయమని తెలిపారు. పంచభూతాత్మకమైన ప్రకృతిలో మానవ జీవనానికి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సోపానాలుగా నిలుస్తాయన్నారు.జిల్లా కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రంభాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లోకకళ్యాణార్థం తొమ్మిది రోజులపాటు కోటి వత్తులతో నిర్వహించిన గంగా హారతి కార్యక్రమానికి ముగింపుగా ఐదు కోట్ల వత్తులతో సముద్రునికి కుంభహారతి నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర ప్రజల భోగభాగ్యాలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బొలిశెట్టి వెంకటరామకృష్ణ, పెండెం సత్యనారాయణ, పితాని లీలావతి, చామర్తి నాగమణి, నక్కా సత్య, సతీష్, మురాలశెట్టి నాగమణి, వీర ప్రభాకరరావు,గుత్తుల గంగాభవాని, మేకా మల్లికాశివ, దేవరపల్లి విజయలక్ష్మి, వెంకటేష్, వేదుల గణేష్, పాలిక నాగబాబు, సీ.రెడ్డి రమేష్, కోలా ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు వృథా... పొంచి ఉన్న కాలుష్యం





నిద్రపోతున్న యంత్రాంగం

**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 24:**ఉంగుటూరు సీపీడబ్ల్యూ పథకం ద్వారా రావులపర్రు, కాగుపాడు, దొంతవరం, పొట్టిపాడు, కాకర్లమూడి, తోట రామచంద్రపురం, వీఏపురం తదితర గ్రామాల్లో 35 వేలకు పైగా ప్రజలకు అందుతున్న రక్షిత తాగునీటి ప్రధాన పైపులైన్ లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి వృథాతో పాటు కాలుష్య ముప్పు పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఉంగుటూరు--రావులపర్రు మార్గంలో పలుచోట్ల వాల్వుల నుంచి నీరు లీకై వెల్ సంపుల్లోకి చేరి, అవి నిండిపోయి రహదారి పక్కనున్న పంట బోదెల్లోకి నీరు వృథాగా ప్రవహిస్తోంది. ఇదే సమయంలో నిండుగా ఉన్న సంపుల వద్ద కొందరు ద్విచక్ర వాహనదారులు వాహనాలను కడగడం, ఇతర అవసరాలకు నీటిని వినియోగించడం వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఉంగుటూరులో నీటిని శుద్ధి చేసి పైపుల ద్వారా గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు లీకేజీలపై దృష్టి సారించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైపులైన్ లీకేజీలను అరికట్టి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కలుషిత నీటి కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నిస్తున్నారు.



## వర్షపు నీరు నిలవకుండా చర్యలు

**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 24:**వర్షాల కారణంగా రహదారులు, వీధుల్లో నీరు నిలవకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఉంగుటూరు తహాశీల్దారు మద్రపు సన్యాసిరావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.వీధుల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ జేసీబీల సహాయంతో పూడికలు తొలగించి నీటిని మళ్లించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నారాయణపురం రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలిచిన విషయాన్ని గుర్తించి, నీటిని తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తహాశీల్దారు సన్యాసిరావు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా నీరు నిలిచినట్లు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## ప్రశాంతంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్: 24** :తుఫాన్ ప్రభావం ఉదయం నుండి ఏడ తెలివిలేని వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షాలు సైతం లెక్కచేయకుండా మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం పోలిసువారి ఈ కార్యక్రమం కు బందోబస్తు ఏర్పాటు చేశారు. బొబ్బిలంక, సీతానగరం, వంగలపూడి , సింగవరం, తదితర గ్రామాల్లో గురువారం నాడు మేళ తాళాలతో అంగరంగ వైభవంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగించారు. మండలంలోని విగ్రహాలను వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు.

## భారీ వర్షాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**భారీ వర్షాలలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. గురువారం నగరపాలక అధికారులతో కలిసి ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీపేటలో పర్యటించారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో పరిస్థితిని అంచనా వేసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు. వర్షపు నీరు నిలిచే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర హోర్డింగులను వెంటనే తొలగించాలన్నారు. కూలిన చెట్లను తొలగించడంతో పాటు అవసరమైన చోట చెట్ల కొమ్మలను కత్తిరించాలన్నారు. కంట్రోల్ రూమ్ 9494060060 నెంబర్ 24 గంటలూ పనిచేయాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని.. ప్రభుత్వ సహాయక చర్యలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఈఈ మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు.నేలకొరిగిన భారీ వృక్షాలు..





**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 24;** అడ్డతీగల మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపు లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. మండలంలో పెద్దేరు వాగు, మదేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రముతో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
మండలంలో పనుకురాతిపాలెం, కొత్తపాలెం, పింజరకొండ , డి. కృష్ణవరం, ఉప్పలపాడు గ్రామాలకు ఏ గ్రామంతోను సాసంబంధాలు లేవనే చెప్పవచ్చు, పొంగిపొర్లుతున్న వాగులు ఈ గ్రామాల సరిహద్దుగుండా ప్రవహించడం దీనికి కారణం. అయితే అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు వాగుల వైపు ఎవరూ రాకుండా హెచ్చరికల బోర్డులు పెట్టి తమ సిబ్బందిని వాగులు వెంబడి ఎవరు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అయితే మండల కేంద్రంతో రాకపోకలు నిలిచిపోవడంతో ఈ ఐదు గ్రామాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో అధికారులు ఎప్పటికప్పుడు వారి బాగోగులను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వైద్య సిబ్బంది అవసరమైన మందులు ,త్రాగునీరు వీరికి ఎంతైనా అవసరం. అయితే నిత్యవసర సరుకులు వీరికి అందే పరిస్థితి అంతంత మాత్రమే వర్షాకాలం వచ్చిందంటేనే వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల ప్రతిసారి ఈ గ్రామస్తులకు ఈ ఇబ్బంది తప్పడం లేదు. అలాగే దుప్పలపాలెం రహదారిపై భారీ వృక్షం నేలకు వరగడంతో ట్రాఫిక్ స్తంభించింది, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మండల కేంద్రంలో జనజీవనం స్తంభించింది ,బుధవారం సగటున 43 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

## 5వ డివిజన్లో రూ.43.50 లక్షలతో తాగునీటి పైప్‌లైన్



ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**స్థానిక 5వ డివిజన్ మఠం వీధిలో తాగునీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టినట్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రూ.43.50 లక్షల అంచనా వ్యయంతో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మఠం వీధిలో సుమారు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పీవీసీ పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవు తోందన్నారు. లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితమయ్యే సమస్య తలెత్తుతోందన్నారు. మఠం వీధితో పాటు పరిసర వీధులకు కూడా నూతన పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా చేపడుతున్నట్లు వివరించారు. పనుల్లో నాణ్యత లో రాజీ పడకుండా నెల రోజుల్లో పనులను పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రూ.2 కోట్లు నగదుతో ఉడా యించిన నిందితులు అరెస్ట్

సొమ్ము రూ.1,99 కోట్లు- ను స్వాధీనం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**ఈనెల 21 తేదీన ఉదయం 07:40 గం లకుదానవాయిపేట లో గల ఎస్ బి ఐ రీజినల్ ఆఫీసు వద్ద కందుల సురేష్ కుమార్, తన డ్రైవర్ పాండూరి సాయి శివకు బ్యాంకులో జమ చేయాల్సిన రూ.2 కోట్లు నగదును కారులో 2 సంచులలో పెట్టి జిమ్ కు వెళ్లడం జరిగింది. తిరిగి ఉదయం 08:45 వచ్చేసరికి డ్రైవర్ (నిందితుడు) రూ.2 కోట్లు నగదుతో పరారై మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో ఫిర్యాదుదారు అదే రోజు స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా క్రైం నం: 216/2026 కేసు రిజిస్టర్ చేయడం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ , సెంట్రల్ జోన్ ఇంచార్జ్ పాటిల్ దేవరాజ్ మనీష్, పర్యవేక్షణలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ .మురళీ కృష్ణ సబ్ ఇన్స్పెక్టర్ జె .ఆదినారాయణ, సిబ్బంది ఈ కేసులో ముద్దాయిలు అయిన ఏ 1పండూరి సాయిశివ, ఏ 2. అప్పాబత్తుల దుర్గావర ప్రసాద్, ధవళేశ్వరం, ఏ 3. పండూరి వీర వెంకట సత్య ప్రసాద్, ధవళేశ్వరం లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగిలించిన సొమ్ము లోరూ.1,99,25,000/- ను రికవరీ చేయడం జరిగింది.
ఈ కేసును ను త్వరితగతిన చేధించి, రికవరీ చేసిన × టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ .మురళీ కృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్ జె .ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ జి .నాగమునీంద్ర , కానిస్టేబుల్ లు కె.సోమేష్, జి.సుమన్, పి.పోసయ్య లను ఎస్పీ డి.నరసింహ కిషోర్ , జిల్లా తూర్పుగోదావరి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ , సెంట్రల్ జోన్ ఇంచార్జ్ పాటిల్ దేవరాజ్ మనీష్, అభినందించినారు.

## గంగవరం మండలంలో భారీ వర్షాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగులు.. జలమయమైన లోతట్టు ప్రాంతాలు

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**గంగవరం మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, కాలువల్లో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.మండలంలోని కన్నేరు, పెద్దేరు, దొంగ కాలువ, జువ్వమ్మ కాలువ, పెద్ద కాలువ తదితర వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాగుల ఉధృతి పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.
భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు ఇళ్ల పరిసరాల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూములు సైతం నీట మునిగే పరిస్థితి ఏర్పడింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని స్థానికులు సూచిస్తున్నారు. వర్షాలు మరింత కొనసాగితే పరిస్థితి ఎలా ఉంటుందోనని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వాగులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితిని పర్యవేక్షించి ప్రజలకు అవసరమైన సూచనలు, సహాయక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఈనెల 26 నుంచి అక్టోబరు 2 వరకు ఉంగుటూరు రైల్వే గేటు మూత



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 24:**ఉంగుటూరు రైల్వే గేటును ఈనెల 26వ తేదీ ఉదయం 6 గంటల నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వారం రోజులపాటు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఉంగుటూరు పంచాయతీ అభివృద్ధి అధికారి బీవీ రవిచంద్రకుమార్ తెలిపారు. విజయవాడ--విశాఖపట్నం రైలు మార్గంలో ట్రాక్ పటిష్టత, నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో రైల్వే క్రాసింగ్ గేటును మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని సహకరించాలని అధికారులు సూచించారు.

## నగరంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

కమిషనర్ రాహుల్ మీనా చే టీజర్ ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 24:**ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలకు నగరం మరోసారి వేదిక కానుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో అక్టోబర్ 8 , 9 తేదీల్లో నగరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో వారోత్సవాలు జరగనున్నాయి. నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యం లో ఇస్రో ఈ కార్యక్రమం నిర్వహించనుంది. ఇందులో భాగంగా ఇస్రో సివిల్ డివిజన్ హెడ్ వి.లక్ష్మణ సతీష్, సీనియర్ శాస్త్రవేత్త కె.అశ్విని గురువారం కమిషనర్ రాహుల్ మీనా ను ఆయన ఛాంబర్ లో కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇస్రో చేపట్టిన ప్రయోగాల రాకెట్ నమూనాలు ఈ వారోత్సవాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. 6 తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, స్పాట్ క్విజ్, స్పాట్ ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించ డం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగ పరచుకోవలసిందిగా సూచించారు. అనంతరం టీజర్ ను ఆవిష్కరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com